సాక్షి
ఖమ్మం
మంగళవారం । 17 । జనవరి । 2023



ఇలా రండి.. అలా వెళ్లండి

కలెక్టరేట్ ప్రారంభోత్సవం, బీఆర్ఎస్ సభ నేపథ్యాన ప్రాంగణానికి వచ్చివెళ్లేందుకు గాను పోలీసులు రూట్ మ్యాప్ విడుదల చేశారు. 8లో

న్యూస్‌రీల్

'కంటి వెలుగు'పై శిక్షణ



శిక్షణ తీసుకుంటున్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు

ఖమ్మం వైద్యవిభాగం : ఈనెల 18న ప్రారంభమయ్యే కంటి వెలుగు విధులు నిర్వర్తించే ఆప్తాల్మిక్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఖమ్మం పెద్దాస్పత్రిలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ రాజేశ్వరరావు ఆధ్వర్యాన శుక్రవారం శిక్షణ ఏర్పాటుచేశారు. శిబిరాలకు వచ్చే వారిని పరీక్షించాల్సిన విధానం, దగ్గర, దూరం చూపు, కంటి సమస్యలు గుర్తించడంపై అవగాహన కల్పించారు.

గ్రూప్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఎస్సీ అభ్యర్థులకు గ్రూప్ – 2, 3, 4 తదితర పోటీ పరీక్షలకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. వంద మంది అభ్యర్థులకు నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణ ఇవ్వనుండగా, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈనెల 31లోపు టీఎస్ స్టడీసర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 98484 94290, 90320 77276 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కాగా, ఫిబ్రవరి 6నుండి ఉచిత శిక్షణ ఉంటుందని డీడీ తెలిపారు.

రెండు రోజుల పాటు 'వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కాలేజీలో కేంద్ర మంత్రిత్వ శాఖ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యాన ఈనెల 19నుండి రెండు రోజుల పాటు వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగామ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం అజయ్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు(సీపీఎస్‌యూఎస్) దీర్ఘకాలిక వ్యాపార సంబంధాలను ఏర్పర్చుకోవడం, పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ(పీపీపీ)కి అనుగుణంగా వార్షికావసరాల్లో కనీసం 25 శాతం ఎంఎస్ఎంఈల నుంచి సేకరించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వర్తమాన, ఔత్సాహిక వ్యాపారవేత్తలు పాల్గొనాలని సూచించారు.

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ఆస్పత్రిలో ఇన్ఫెక్షన్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరరావు సోమవారం సమీక్షించారు. అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఎప్పటికప్పుడు మెడికల్ వేస్ట్ తరలించాలని సూచించారు. అలాగే, ఆస్పత్రికి వచ్చే వారితో మర్యాదగా మెలగాలని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావుతో పాటు వివిధ విభాగాల హెచ్ఓడీలు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

సభకు సన్నద్ధం



సభాప్రాంగణానికి వెళ్లే మార్గంలో ఏర్పాట్లుచేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు

బీఆర్ఎస్ సభకు పూర్తి కావొచ్చిన ఏర్పాట్లు

- 13 నియోజకవర్గాల నుంచి జన సమీకరణ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ
- బందోబస్తుకు ప్రత్యేకంగా ఆరుగురు సీనియర్ ఐపీఎస్‌లు



సిద్ధమైన సభావేదిక, ప్రాంగణం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం గుమ్మంలో జరగనున్న బీఆర్ఎస్ బహిరంగ సభకు ఏర్పాట్లన్నీ చివరి దశకు చేరాయి. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఈనెల 18న నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవంతోపాటు రాష్ట్రస్థాయిలో కంటివెలుగు కార్యక్రమం రెండో దశ ప్రారంభం.. ఆతర్వాత భారీ బహిరంగ సభ జరగనుండడంతో బీఆర్ఎస్ నాయకగణం అంతా ఖమ్మంలోనే మకాం వేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు మూడు రాష్ట్రాల సీఎంలు, అలాగే మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతుండటంతో ఏర్పాట్లను ఇటు బీఆర్ఎస్ నాయకత్వంతోపాటు అటు అధికార, పోలీస్ యంత్రాంగం దగ్గరుండి పర్యవేక్షిస్తోంది.

ఐదు లక్షల మంది వరకు జన సమీకరణ

ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి సుమారు ఐదు లక్షల మంది వరకు జన సమీకరణపై బీఆర్ఎస్ పార్టీ దృష్టి సారించింది. ఈ ప్రాంతాల్లో సన్నాహక సమావేశాలు కూడా ముగియగా, మంత్రి హరీశ్‌రావు పర్యవేక్షణలో ఏ నియోజకవర్గం నుంచి ఎందరిని తరలించాలనే కసరత్తు పూర్తయింది. ఆయా నియోజకవర్గాల నుంచి వాచ్చే వారి వాహనాల కోసం 20 పార్కింగ్ ప్రాంతాలను కేటాయించడమే కాక పోలీసు యంత్రాంగం రూట్‌మ్యాప్, పార్కింగ్ ప్రాంతాల వివరాలను వెల్లడించింది. మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కలెక్టరేట్, సభ ప్రాంగణంలో ఉండి ఏర్పాట్లపై పోలీసు, ఇతర అధికారులతో సమీక్షించారు.

ఖమ్మం గులాబీ మయం

బీఆర్ఎస్ సభ నేపథ్యాన ఖమ్మం గులాబీమయమైంది. సూర్యాపేట, కోదాడ, ఇల్లెందు, వరంగల్, వైరా, భద్రాచలం రోడ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు ఉమ్మడి జిల్లా ప్రముఖులు, సభకు హాజరయ్యే సీఎంలు, జాతీయ స్థాయి నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటయ్యాయి. దారిపొడవునా ఏర్పాటు చేయడంతో గులాబీ కళ ఉట్టిపడుతోంది. బహిరంగ సభావేదిక, ప్రాంగణంలో ఏర్పాట్లు మంత్రి హరీశ్‌రావు పర్యవేక్షణలో జరిగాయి. వేదికపై ముఖ్యఅతిథులతోపాటు ఉమ్మడి జిల్లా ముఖ్యప్రజాప్రతినిధులు, నేతలు కూర్చోవాలని ఇప్పటికే ఆదేశాలు అందాయి. వేదిక ముందు ఏర్పాటు చేసిన గ్యాలరీల్లో రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చే ముఖ్యప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, ఉద్యమకారులకు స్థానాలు కేటాయిస్తున్నారు.

భారీ బందోబస్తు

ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు మరో ముగ్గురు సీఎంలు, ఒక మాజీ సీఎం, జాతీయస్థాయి పార్టీల నేతలు సభకు హాజరవుతుండటంతో బందోబస్తుపై పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది. ట్రాఫిక్ చిక్కులు లేకుండా చూస్తూనే నిఘా ఏర్పాటుచేశారు. సీఎంల పర్యటనకు సంబంధించి ఆరుగురు సీనియర్ ఐపీఎస్‌లకు బాధ్యతలు కేటాయిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, ఐజీలు షానవాజ్‌ఖాసిం, చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ, వరంగల్ సీపీ ఏ.వీ.రంగనాథ్, జోగుళాంబ గద్వాల డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్, సిరిసిల్ల జోన్ డీఐజీ రమేష్‌నాయుడుతో పాటు భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల ఎస్పీలు వినీత్, శరత్‌చంద్ర పవార్‌కు బాధ్యతలు అప్పగించగా ఇప్పటికే జిల్లాకు చేరుకున్నారు. అంతేకాక పది మంది ఏఎస్పీలు, 39మంది ఏసీపీలు, 139మంది ఇన్‌స్పెక్టర్లు, 409మంది ఎస్సైలు, 1,772 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, 169మంది మహిళా కానిస్టేబుళ్లు, 1,005 హోంగార్డులు, 120మంది స్పెషల్ పార్టీ పోలీసులు ఇతరత్రా కలిపి 4,198 మందితో బందోబస్తు చేపట్టనున్నారు.

ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష



సభా ప్రాంగణంలో పరిశీలిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, అజయ్‌కుమార్ తదితరులు

ఖమ్మం అర్బన్: సీఎం కేసీఆర్ పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ కుమార్ సోమవారం సమీక్షించారు. కొత్త కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన వారు స్వాగతం, ప్రారంభోత్సవాలతో పాటు భద్రత ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ మళ్లించాలని, రోజువారి కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. సభకు వచ్చిన ప్రజలు తిరిగి క్షేమంగా ఇళ్లకు చేరేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈసమీక్ష, పరిశీలనలో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, రైతు బంధు సమితి రాష్ట్ర చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, గణేష్‌గుప్తా, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఖమ్మం కలెక్టర్ గౌతమ్, పోలీసు అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, రంగనాథ్, షానవాజ్ ఖాసిం, విష్ణు ఎస్.వారియర్, శరత్‌చంద్రపవార్, అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో పాటు రాధికాగుప్తా, డాక్టర్ షబరీష్, అఖిల్ మహాజన్, సుభాష్‌చంద్రబోస్, లక్ష్మణ్, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి ముస్తాబు



నూతన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం సమీపాన నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్) ప్రారంభానికి ముస్తాబైందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. సకల సౌకర్యాలు, విశాలమైన గదులు, ఆధునిక హంగులు, చుట్టూ నందనవనాన్ని తలపించేలా గార్డెన్లతో కూడిన కలెక్టరేట్‌ను బుధవారం సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఢిల్లీ, కేరళ, పంజాబ్ సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, పినరయి విజయన్, భగవంత్ మాన్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. 20.10 ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 2 విధానంలో రూ.53.20కోట్లతో కలెక్టరేట్‌ను నిర్మించగా, 39 శాఖలకు ఇప్పటికే గదులను కేటాయించామని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఒకేచోట కొలువుదీరనున్న ఈ భవనం జిల్లా కీర్తి కిరీటంలో కలికితురాయిగా నిలువనుందని కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు.

యుద్ధానికి బీఆర్ఎస్ సిద్ధం

- ఖమ్మంలో ఆరంభం.. హస్తినలో ముగింపు
- వంద ఎకరాల్లో ఐదు లక్షల మందితో భారీ సభ
- కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నాం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్‌కుమార్



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'కేంద్రంలోని భారతీయ జనతాపార్టీ అనుసరిస్తున్న విధానాలపై యుద్ధానికి బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందుకు వేదికగా ఖమ్మం నుంచే రాజకీయ అస్త్రాలను ఎక్కుపెడుతోంది.. దేశ రాజకీయ గతిని మార్చే శక్తి బీఆర్ఎస్‌కే ఉంది.. ఆదిశగా దేశంలోని ప్రజలను చైతన్యవంతులను చేసే ప్రక్రియ ఖమ్మం నుంచే అంకురార్పణ జరుగుతుండటం మాకు గర్వకారణం'. అని రాష్ట రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఈనెల 18న నిర్వహించే బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు భారీ ఎత్తున జన సమీకరణ చేస్తున్నట్లు చెప్పిన ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు ముగ్గురు సీఎంలు, ఒక మాజీ సీఎం పాల్గొంటున్న సభ ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. బీఆర్ఎస్ సభకు జన సమీకరణ తదితర అంశాలపై సోమవారం మంత్రి పువ్వాడ 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలు వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

ఐదు లక్షల మందితో భారీ సభ..

నూతన కలెక్టరేట్ సమీపాన ఈనెల 18న వంద ఎకరాల్లో నిర్వహించే బహిరంగ సభకు భారీ స్థాయిలో జన సమీకరణ చేపట్టగా, ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎవరికి కేటాయించిన బాధ్యతలు వారు చక్కగా నిర్వర్తిస్తున్నారు. మొత్తం 13 నియోజకవర్గాల నుంచి దాదాపు 5 లక్షల మందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వీలైనన్ని వాహనాలను సమకూర్చి, సభకు హాజరయ్యే వారికి ఇబ్బంది కలగకుండా పార్కింగ్, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ఖమ్మం నుంచే గురి..

బీఆర్ఎస్ తొలి సభను ఖమ్మంలో ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడానికి ఒక కారణం ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా చైతన్యవంతమైన ప్రాంతం కావడంతో ఇక్కడి ప్రజలు మతతత్వ శక్తులను ప్రోత్సహించరు. బీఆర్ఎస్ విధానాలు, లక్ష్యాలతోపాటు జాతీయ పార్టీ ప్రారంభించడానికి దారితీసిన పరిస్థితులను ఈ వేదిక నుంచే వివరిస్తారు. కేంద్రంలోని బీజేపీ తీరుతో దేశం నష్టపోతున్న తీరును సీఎం కేసీఆర్ తెలియజేస్తారు. దేశ రాజకీయాల్లో సరికొత్త ఒరవడిని సృష్టించడమే బీఆర్ఎస్ లక్ష్యం కాగా.. ఇందుకు ప్రధాన వేదికవుతున్న ఖమ్మం దేశ రాజకీయ చరిత్ర పుటల్లోకి ఎక్కనుంది.

ఈ కారణంతోనే బీఆర్ఎస్..

భారతీయ జనతా పార్టీ తీరుతో ప్రతిపక్షాలన్నీ నిర్వీర్యమయ్యాయి. దేశంలో లౌకికవాద విలువలు కరువవుతున్నాయి. వీటిని కాపాడేందుకు అందరం నడుం బిగించాలి. కేసీఆర్ నేతృత్వంలో ఏర్పాటైన బీఆర్ఎస్ ఎలాంటి రాజీ లేకుండా లౌకికవాదం కోసం నిలబడుతుంది. రాజకీయాలు, మతాలను వేరుగా చూడాలనే ప్రాథమిక సూత్రాన్ని, ప్రగతిశీల విధానాన్ని బీఆర్ఎస్ పాటిస్తుంది. బీజేపీ - ఆర్ఎస్ఎస్‌పై పోరాటానికి పార్లమెంట్‌లో లౌకిక ప్రగతిశీల శక్తులను బలోపేతం చేయడం అవసరం. బీజేపీని దీటుగా ఎదుర్కొనేందుకు ఆవిర్భవించిన బీఆర్ఎస్.. ఈ పనిని సమర్థవంతంగా చేస్తుందనే విశ్వాసం అందరిలో ఉంది.

భవిష్యత్ కూడా మాదే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో పదికి పది సీట్లు సాధించడం గొప్ప విషయమేం కాదు. జిల్లాలో కమ్యూనిస్టుల ప్రభావం కూడా ఉంది. మతతత్వ శక్తులను మట్టి కరిపించేందుకు బీఆర్ఎస్ దారిలో కమ్యూనిస్టులు కూడా కలిసొస్తుండడం, ఈ చారిత్రక వేదికకు ఖమ్మం పునాది అవుతుండటం సంతోషంగా ఉంది. ఇదేస్ఫూర్తితో ముందుకు వెళ్లి ఉమ్మడి జిల్లాలో విజయదుందుభి మోగిస్తాం. బీజేపీకి ఉమ్మడి జిల్లాలో స్థానం లేకపోగా, ప్రజలు ఆ పార్టీని ఆదరించేందుకు సిద్ధంగా లేరు. ఇక కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు క్షీణిస్తోంది.

ఆ పార్టీలో చేరితే ఓటమిని ఆహ్వానించడమే..

ఉమ్మడి జిల్లాలో ఎవరైనా బీజేపీలో చేరడం అంటే ఓటమిని ఆహ్వానించడమే. బీజేపీకి ఇక్కడ సంస్థాగత బలం లేదు. ఈ ప్రాంత హిందూ, ముస్లింలు, క్రిస్టియన్లు అందరూ కలిసి మెలసి ఉంటారు. ఈ నేపథ్యాన ఎవరైనా బీజేపీలో చేరితే కోరి ఓటమిని కొని తెచ్చుకున్నట్లే. వచ్చే ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ హవా కొనసాగడం తథ్యం.

విహంగ వీక్షణం



రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో నిర్మించిన నూతన కలెక్టరేట్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈనెల 18న కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ సహా పంజాబ్, ఢిల్లీ, కేరళ సీఎంలు ప్రారంభించనున్నారు. ఆతర్వాత వెనుకాల స్థలంలో నిర్వహించనున్న బీఆర్ఎస బహిరంగ సభలోనూ వీరు పాల్గొంటారు. ఈ నేపథ్యాన ఏర్పాట్లు పూర్తికాగా.. కలెక్టరేట్ ఆవరణ, ఆ పక్కనే బహిరంగ సభాస్థలి కనిపించేలా తీసిన డ్రోన్ చిత్రమే ఇది!

వందేభారత్‌కు ఘనస్వాగతం

- రైలుకు స్వాగతం పలికిన ఎంపీలు నామ, వద్దిరాజు
- హాజరైన కలెక్టర్ గౌతమ్, రైల్వే అధికారులు
- పెద్దసంఖ్యలో పాల్గొన్న ప్రజలు



పచ్చజెండా ఊపుతున్న ఎంపీలు నామ, రవిచంద్ర, పక్కన ఎమ్మెల్సీ మధు, కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

ఖమ్మంమామిళ్లగూడెం: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వరకు ఖమ్మం మీదుగా రాకపోకలు సాగించనున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం మొదలైంది. రైలును ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించగా... ఖమ్మం స్టేషన్‌కు ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల వరకు వచ్చిన రైలుకు ఘనస్వాగతం లభించింది. ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు డప్పుచప్పుళ్లు, ప్రయాణికుల కేరింతల మధ్య పచ్చజెండా ఊపి ఘనస్వాగతం పలికారు. అలాగే, రైలు ఎక్కి వసతులను పరిశీలించడంతో పాటు వసతులను పరిశీలించారు, అధికారులు, ప్రయాణికులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వీ.పీ. గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ ఇతర అధికారులు పాల్గొనగా.. తొలుత రైల్వే అధికారులు స్వాగతం పలికి సత్కరించారు. రైల్వే అధికారులు ప్రశాంత్ కాక్‌డే, వీఆర్ఎల్‌వీ.శాస్త్రి, జాఫర్, మోహన్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, జీఎస్‌పీ.ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, గుండ్లపల్లి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌లో నృత్యం చేస్తున్న బీజేపీ నాయకులు

మార్మోగిన మోదీ నినాదాలు

వందేభారత్ రైలుకు స్వాగతం పలికేందుకు బీజేపీ కార్యకర్తలు కూడా భారీగా తరలివచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ మోదీ నినాదాలు చేయగా... డప్పుచప్పుళ్లతో సందడి చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డితో పాటు సన్నె ఉదయ్‌ప్రతాప్, దొంగల సత్యనారా యణ, రుద్ర ప్రదీప్, శ్యాంరాథోడ్, నున్న రవికుమార్, అరుణ, అంజయ్య, లక్ష్మీనారాయణగుప్తా, వేల్పుల సుధాకర్, మేకల నాగేందర్, నకిరికంటి వీరభద్రం, జ్వాలా నర్సింహరావు, ఉషారాణి, మంద సరస్వతి, డీకొండ శ్యాం, వీరెల్లి రాజేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇక వందేభారత్ రైలును చూసేందుకు జిల్లా వాసులు కూడా పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం 1–30 గంటలకు రైలు వస్తుందని చెప్పినా మూడు గంటలకు వచ్చింది. అయినా ప్రజలు ఓపికగా ఉండి.. రైలుకు స్వాగతం పలికి ఆసక్తిగా పరిశీలించారు. అయితే, లోనకు వెళ్లేందుకు పోలీసులు ఎవరినీ అనుమతించకపోవడంతో రైలు వద్ద సెల్ఫీలు దిగడం కనిపించింది.

తక్కువ సమయంలో విశాఖకు..



సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంకు కేవలం 8గంటల వెళ్లనుండడంతో సమయం కలిసొస్తుంది. ఇక రైలులో సౌకర్యాలు బాగున్నాయి. సీటు పక్కనే సెల్ చార్జింగ్ పాయింట్ ఏర్పాటు బాగుంది. సీటు ఎదురుగా ల్యాప్‌ట్యాప్ పెట్టుకోవటానికి, టిఫెన్ చేయటానికి చిన్నపాటి టేబుల్ ఏర్పాటుచేశారు.

– రమేష్, ప్రయాణికుడు

డబ్బు పోయినా సాఫీగా..



టిక్కెట్ ధర ఎక్కువనిపిస్తున్నా... సౌకర్యవంతంగా ప్రయాణించే వెసులుబాటు దక్కుతోంది. ఎగ్జిక్యూటివ్ క్లాస్ సౌకర్యం చాలా బాగుంది. బటన్ నొక్కగానే సీటు అద్దాల వైపుకు తిరుగుతుంది. తద్వారా పరిసరాలు చూస్తూ ఒత్తిడి మరిచిపోవచ్చు. తక్కువ సమయంలో వేగంగా గమ్యానికి చేరుకుంటాం.

– షరీఫ్, ప్రయాణికుడు

బీజేపీలో చేరితే ఆత్మహత్యాసదృశ్యమే



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన మరో మంత్రి అజయ్, ఎంపీలు నామ, రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు, మాజీ మంత్రి తుమ్మల తదితరులు

- ఖమ్మంలో మతతత్వ పార్టీలకు స్థానం ఉండదు
- బహిరంగ సభ జన సమీకరణలో పెద్ద పీట
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీకి ఖమ్మం జిల్లాలో స్థానం లేదని.. ఎవరైనా తెలిసో, తెలియకో ఆ పార్టీలో చేరితే అది ఆత్మహత్యాదృశ్యమేనని, వారి గొయ్యి వారు తవ్వుకున్నట్లేనని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. బీఆర్ఎస్ సభ ఖమ్మం నియోజవకర్గ సన్నాహక సమావేశం మంత్రి పువ్వాడ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేయగా హరీశ్‌రావు మాట్లాడారు. పోరాటాల పురిటిగడ్డ, ఎర్రజెండా ఏలిన ఈ గడ్డపై బీజేపీ మొలకెత్తదని తెలిపారు. ఖమ్మంలో ముమ్మాటికీ అభివృద్ధికి పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ఉండే పరిస్థితి లేనందున వచ్చే ఎన్నికల్లో పదికి పది స్థానాలు బీఆర్ఎస్ గెలిచి తీరాల్సిందేనని పిలుపునిచ్చారు. కాగా, ఖమ్మంకు వచ్చినప్పుడల్లా ఇక్కడ అభివృద్ధిని చూసి ఫొటోలు తీసుకెళ్లి తన నియోజవర్గంలో అభివృద్ధి చేస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. లకారంలో ఒకప్పుడు మురుగునీరు, కంప చెట్లు, దోమలు, పందులు ఉండగా.. ఇప్పుడు సుందరంగా తయారైందన్నారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వల్లే ఇంత అభివృద్ధి సాధ్యమైందన్నారు. అయితే, పనులు చేసుకోవడమే కాక... బహిరంగ సభకు జన సమీకరణలో ఖమ్మం నియోజకవర్గం ముందుండాలని సూచించారు. కాగా, సన్నాహక సమావేశం అనంతరం జన సమీకరణపై ముఖ్య నేతలతో మంత్రి హరీశ్ ప్రత్యేకంగా మాట్లాడారు. నాయకులు, కార్పొరేటర్లు మక్కాల రాజేష్, దండగుల రాంబాబు, కర్నాటి కృష్ణ, దోరేపల్లి శ్వేత, తాజుద్దీన్, పగడాల నాగరాజు, వీరూనాయక్‌తో మాట్లాడి వాహనాలు, జనసేకరణపై ఆరా తీశారు. ప్రజల వాహనాల్లో నాయకులు రావాలని, మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 4.30 గంటల వరకు సభా ప్రాంగణం నుండి ఎవరూ కదలకుండా చూడాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు.

ఖమ్మంలో అబద్ధాలు చెప్పే బ్యాచ్

ఖమ్మంలో కొందరు పనికిమాలిన వాళ్లు తయారై.. అజయ్ అన్న కూకట్‌పల్లి పోతుండు అని కొత్త ప్రచారం మొదలు పెట్టారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. అయితే, తానెక్కడకు వెళ్లేది లేదని.. ఇంకా దంచాల్సిన వాళ్లు ఇక్కడ ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభ అవకాశాన్ని ఖమ్మంకు వచ్చిన కేసీఆర్‌కు జిల్లాపై ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ సభకు ఖమ్మం నియోజకవర్గం నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే రాములునాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, డీసీఎంఎస్, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు ఆర్‌జేసీ.కృష్ణ, వీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



అంతా సిద్ధం..

పోలీసులు విడుదల చేసిన రూట్‌మ్యాప్

బీఆర్‌ఎస్ బహిరంగ సభకు భారీ బందోబస్తు

- ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ ఏర్పాట్లపై పోలీసుల సూచనలు
- రూట్‌మ్యాప్ కూడా విడుదల
- 18న ఉదయం 6 నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు

ఖమ్మంక్రైం: ఖమ్మం నూతన కలెక్టరేట్‌తో పాటు కంటి వెలుగు రెండో దశను సీఎం కేసీఆర్ సహా కేరళ, పంజాబ్, ఢిల్లీ సీఎంలు ప్రారంభించనున్నారు. అనంతరం కలెక్టరేట్ సమీపాన జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభలో వీరే కాకుండా పార్టీల ముఖ్య నేతలు పాల్గొననున్నారు. ఈనేపథ్యాన 18న బుధవారం ఉదయం 6నుంచి రాత్రి 11 గంటల వరకు ఖమ్మం వైపునకు వచ్చే సాధారణ, భారీ వాహనాలను మళ్లించనున్నారు. వాహనాల మళ్లింపు, సభకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ ఇతర అంశాలను పోలీసులు వెల్లడించారు.

రూట్ల వారీగా వాహనాల మళ్లింపు ఇలా...

■ సూర్యాపేట టౌన్ నుంచి ఖమ్మం కొత్త బైపాస్ రోడ్డుకు(కొత్త హైవే)కు వచ్చే సత్తుపల్లి, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లే వాహనాలు కోదాడ హైవే మీదుగా విజయవాడ వైపు దారి మళ్లిస్తారు.

■ సూర్యాపేట టౌన్ నుంచి ఖమ్మం పాత రోడ్డు మీదుగా సత్తుపల్లి, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లే వాహనాలు కోదాడ హైవే మీదుగా దారి మళ్లించారు. సత్తుపల్లి, రాజమండ్రి ప్రాంతాలకు వెళ్లే బస్సులను పూర్తిగా కోదాడ వైపు నుంచి మళ్లిస్తారు.

■ కోదాడ నుంచి ఖమ్మం వైపు వచ్చే వాహనాలు విజయవాడ హైవే వైపునకు దారి మళ్లించనున్నారు.

■ కూసుమంచి వరకు వచ్చిన సత్తుపల్లి, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్ల వాహనాలు ముతాపురం, నేలకొండపల్లి, కోదాడ హైవే మీదుగా విజయవాడకు దారి మళ్లిస్తారు.

■ ఖమ్మం రూరల్ పరిధిలోని వెంకటగిరి క్రాస్ రోడ్డు వైపునకు వచ్చే వాహనాలు వెంకటగిరి, ముదిగొండ, వల్లభి వైపు చిల్లకల్లు హైవే మీదుగా విజయవాడ వైపు దారి మళ్లిస్తారు. అదేవిధంగా కోదాడ క్రాస్ రోడ్డుకు వచ్చే సత్తుపల్లి, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లే వాహనాలు వెంకటగిరి క్రాస్‌రోడ్డు, నేలకొండపల్లి, కోదాడ హైవే మీదుగా విజయవాడ వైపు దారి మళ్లిస్తారు.

■ నాయుడుపేట జంక్షన్‌కు వరంగల్ వైపు నుంచి వచ్చే సత్తుపల్లి, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్ల వాహనాలు ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ మీదుగా కోదాడ క్రాస్‌రోడ్డు, వెంకటగిరి క్రాస్‌రోడ్డు, నేలకొండపల్లి, కోదాడ హైవే మీదుగా విజయవాడ వైపు దారి మళ్లించనున్నారు.

■ పెనుబల్లికి రానున్న సత్తుపల్లి, రాజమండ్రి వెళ్లే వాహనాలు తిరువూరు వయా మైలవరం నుంచి విజయవాడ వైపు మళ్లిస్తారు.

■ సత్తుపల్లి, రాజమండ్రివైపు నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు తల్లాడ మీదుగా ఏన్కూరు, తిమ్మారావుపేట, ముచ్చర్ల క్రాస్ రోడ్డు మీదుగా డోర్నకల్ వైపు దారి మళ్లిస్తారు.

■ కొత్తగూడెం, తల్లాడ వైపు నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు ఏన్కూరు, తిమ్మారావుపేట, ముచ్చర్ల క్రాస్ రోడ్డు మీదుగా డోర్నకల్, మహబూబాబాద్ మీదుగా వెళ్తాయి.

■ తల్లాడ, సత్తుపల్లి, రాజమండ్రి వైపు నుంచి హైదరాబాద్, వరంగల్ వెళ్లే వాహనాలు వైరా టౌన్ మీదుగా పాలడుగు, బోనకల్, చిల్లకల్లు వైపు దారి మళ్లిస్తారు.

■ పల్లిపాడుకు ఏన్కూరు, జన్నారం వైపు నుంచి వచ్చే వాహనాలు వైరా, పాలడుగు, చిల్లకల్లు హైవే మీదుగా దారి మళ్లిస్తారు.

■ మహబూబాబాద్ నుంచి హైదరాబాద్, విజయవాడకు వెళ్లే వాహనాలను కురవి, ములకలపల్లి మీదుగా ఏదులాపురం సర్కిల్ మీదుగా ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్, కోదాడ క్రాస్‌రోడ్, వెంకటగిరి క్రాస్‌రోడ్డు, నేలకొండపల్లి, కోదాడ హైవే మీదుగా విజయవాడ వైపు దారి మళ్లిస్తారు.

■ బోనకల్ నుంచి వచ్చే వాహనాలు తిరిగి చిల్లకల్లు వైపు దారి మళ్లిస్తారు.

■ ఇల్లందు రోడ్డులోని ముచ్చర్ల క్రాస్‌రోడ్డు వైపు వచ్చే వాహనాలను డోర్నకల్, మహబూబాబాద్ వైపు దారి మళ్లిస్తారు.

■ మరిపెడ బంగ్లాకు వరంగల్ వైపు నుంచి సత్తుపల్లి, రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లే వాహనాలు ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్, కోదాడ క్రాస్‌రోడ్ మీదుగా నేలకొండపల్లి, కోదాడ హైవే మీదుగా విజయవాడకు దారి మళ్లిస్తారు.

■ ఖమ్మం నుంచి హైదరాబాద్, వరంగల్ వైపు వెళ్లే వాహనాలు నాయుడుపేట, ఏదులాపురం, వరంగల్ క్రాస్‌రోడ్డు మీదుగా మరిపెడ బంగ్లా, తొర్రూరు మీదుగా హైదరాబాద్, వరంగల్ వైపు వెళ్లాలి.

■ ఖమ్మం నుంచి విజయవాడ, వైరా, రాజమండ్రి, సత్తుపల్లి వైపు వెళ్లే వాహనాలు వెంకటగిరి క్రాస్ రోడ్డు, కోదాడ మీదుగా విజయవాడ వైపు వెళ్లాలి.

■ ఖమ్మం నుంచి ఇల్లందు వైపు వెళ్లే వాహనాలు రామన్నపేట, డోర్నకల్, మహబూబాబాద్ నుంచి వెళ్లాలి.

■ ఖమ్మం నుంచి కోదాడ వెళ్లే వాహనాలు ముస్తఫానగర్, డోర్నకల్, చిల్లకల్లు వైపు వెళ్లాలి.

■ ఖమ్మం నుంచి మహబూబాబాద్ వైపు వెళ్లే వాహనాలు నాయుడుపేట క్రాస్‌రోడ్డు, ఏదులాపురం జంక్షన్, తిరుమలాయపాలెం, మరిపెడ మీదుగా వెళ్లాలి.

ఇలా రండి.. అలా వెళ్లండి

● వాహనాల మళ్లింపు విషయమై వాహనదారులు సహకరించాలని ఖమ్మం సీపీ విష్ణు ఎస్.వారియర్ కోరారు. అంతేకాక రద్దీ కారణంగా అత్యవసరమైతే ప్రయాణాలు చేయొద్దని సూచించారు. ఇక బీఆర్‌ఎస్ బహిరంగ సభకు వాహనాల్లో వచ్చేవారు నిర్దేశిత స్థలాల్లో పార్కింగ్ చేయాలని తెలిపారు.

● కోదాడ, హుజూర్‌నగర్, నేలకొండపల్లి, ముదిగొండ, మధిర కొన్ని ప్రాంతాలు, పాలేరు కొన్ని ప్రాంతాల వారు వయా వెంకటగిరి క్రాస్ రోడ్డు, చర్చి కాంపౌండ్, లకారం, గొల్లగూడెం రోడ్డు మీదుగా శబరి వైన్స్ నుంచి బహిరంగ సభ ప్రాంతానికి చేరుకోవాలి. పార్కింగ్–20లో తమ వాహనాలను నిలిపి తిరిగి వెళ్లేటప్పుడు శబరి వైన్స్, గొల్లగూడెం రోడ్, లకారం చర్చికాంపౌండ్, వెంకటగిరి క్రాస్‌రోడ్డు మీదుగా బయలుదేరాలి.

● పాలేరు నియోజకవర్గం నుంచి వచ్చే వారు కోదాడ, వరంగల్ క్రాస్‌రోడ్డు, ఏదులాపురం క్రాస్‌రోడ్డు, ములకలపల్లి క్రాస్‌రోడ్డు నుంచి నూతన బస్టాండ్ మీదుగా ఎన్‌టీఆర్, శ్రీశ్రీ సర్కిల్ మీదుగా పార్కింగ్–4 పాయింట్‌కు చేరుకుని పార్కింగ్ చేయాలి. తిరుగు ప్రయాణంలో శ్రీశ్రీ సర్కిల్, ఎన్‌టీఆర్‌ఎస్ సర్కిల్, న్యూబస్టాండ్ ములకలపల్లి క్రాస్‌రోడ్డు, ఏదులాపురం క్రాస్‌రోడ్ డీబీఆర్ సర్కిల్, కోదాడ క్రాస్‌రోడ్డు మీదుగా వెళ్లిపోవాలి.

● సూర్యాపేట, నల్లగొండ, తుంగతుర్తి నియోజకవర్గాల నుంచి వచ్చే వారు కోదాడ క్రాస్‌రోడ్, డీబీఆర్ సర్కిల్, ఏదులాపురం క్రాస్‌రోడ్, ములకలపల్లి క్రాస్‌రోడ్, న్యూబస్టాండ్, ఎన్‌టీఆర్ సర్కిల్, శ్రీశ్రీ సర్కిల్ మీదుగా పార్కింగ్–3 పాయింట్‌కు చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో శ్రీశ్రీ సర్కిల్, ఎన్‌టీఆర్ సర్కిల్, న్యూబస్టాండ్, ములకలపల్లి క్రాస్‌రోడ్డు, ఏదులాపురం క్రాస్‌రోడ్డు, డీబీఆర్ సర్కిల్, కోదాడ క్రాస్‌రోడ్డు మీదుగా వెళ్లిపోవాలి.

● ఇల్లెందు, కారేపల్లి,కామేపల్లి, రఘునాథపాలెం నుంచి వచ్చే వారు రఘునాథపాలెం యాపిల్ క్రాస్‌రోడ్డు నుంచి వైఎస్సార్ కాలనీ మీదుగా పార్కింగ్–3లో వాహనాలను నిలపాలి. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో వైఎస్సార్‌కాలనీ, రఘునాథపాలెం క్రాస్‌రోడ్డు మీదుగా వెళ్లిపోవాలి.

● మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గం నుంచి వచ్చేకార్యకర్తలు కురవి, మారెమ్మతల్లి టెంపుల్, ములకలపల్లి క్రాస్‌రోడ్డు నుంచి నూతన బస్టాండ్, ఎన్‌టీఆర్ సర్కిల్, శ్రీశ్రీ సర్కిల్ మీదుగా పార్కింగ్–1కు చేరుకోవాలి. తిరిగి శ్రీశ్రీ సర్కిల్, ఎన్‌టీఆర్ సర్కిల్, నూతన బస్టాండ్, ములకలపల్లి క్రాస్‌రోడ్డు, మారెమ్మతల్లి గుడి మీదుగా కురవి మీదుగా వెళ్లిపోవాలి.

● పాలకుర్తి నుంచి వచ్చే వారు తొర్రూరు, బంగ్లా, ఏదులాపురం క్రాస్‌రోడ్డు, ములకలపల్లి క్రాస్‌రోడ్డు, నూతన బస్టాండ్, ఎన్‌టీఆర్ సర్కిల్, శ్రీశ్రీ సర్కిల్ మీదుగా సభా స్థలికి చేరుకుని పార్కింగ్–1లో పార్కింగ్ చేయాలి. తిరిగి వారు శ్రీశ్రీ సర్కిల్, ఎన్‌టీఆర్‌ఎస్ సర్కిల్, న్యూబస్టాండ్, ములకలపల్లి క్రాస్‌రోడ్డు ఏదులాపురం క్రాస్‌రోడ్డు మీదుగా బంగ్లా, తొర్రూరు మీదుగా వెళ్లిపోవాలి.

● ఖమ్మం నుంచి వచ్చే కార్యకర్తలు నయాబజార్, జెడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, రోటరీ నగర్ మీదుగా శ్రీశ్రీ సర్కిల్ నుంచి పార్కింగ్–2 పాయింట్‌కు చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో శ్రీశ్రీ సర్కిల్, రోటరీనగర్, ఇల్లందు క్రాస్‌రోడ్, జెడ్పీ సెంటర్, నయాబజార్ మీదుగా వెళ్లిపోవాలి.

● కొత్తగూడెం, భద్రాచలం వైపు నుంచి వచ్చే జనం.. కొత్తగూడెం, తల్లాడ, వైరా, కొణిజర్ల మీదుగా పార్కింగ్–7కు చేరుకోవాలి. తిరిగి ఇదే మార్గంలో వెళ్లాలి.

● పినపాక నియోజకవర్గం కార్యకర్తలు కొత్తగూడెం, తల్లాడ, వైరా, కొణిజర్ల మీదుగా పార్కింగ్–11కు చేరుకోవాలి. తిరిగి ఇదేమార్గంలో ప్రయాణించాలి.

● అశ్వారావుపేట వైపునుంచి వచ్చే కార్యకర్తలు వీఎం బంజర, తల్లాడ, వైరా, కొణిజర్ల మీదుగా పార్కింగ్–11కు చేరుకుని.. తిరుగు ప్రయాణంలోనూ ఇదే మార్గం అనుసరించాలి.

● సత్తుపల్లి కార్యకర్తలు వీఎం బంజర, తల్లాడ, వైరా, కొణిజర్ల మీదుగా పార్కింగ్–9కు చేరుకుని, వెళ్లేటప్పుడు కూడా అలాగే వెళ్లాలి.

● మధిర నుంచి వచ్చే జనం బోనకల్, చింతకాని, వందనం మీదుగా పార్కింగ్–9కు చేరుకుని, తిరుగు ప్రయాణంలోనూ ఇదే మార్గం అనుసరించాలి.

● వైరా నుంచి వచ్చే ప్రజలు.. వైరా, కొణిజర్ల మీదుగా పార్కింగ్–10కి చేరుకుని.. మళ్లీ ఇదే మార్గంలో వెళ్లిపోవాలి.

● పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఖమ్మం వెంకటాయపాలెంలో ఈనెల 18న నూతన కలెక్టరేట్ సముదాయ ప్రారంభోత్సవంతో పాటు బీఆర్‌ఎస్ ఆవిర్భావ బహిరంగ సభ జరగనుండగా భద్రతా, ఇతర ఏర్పాట్లను పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్ ఆధ్వర్యాన బందోబస్తు పర్యవేక్షిస్తారు. ఐజీలు షానవాజ్‌ఖాసిం డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్‌తో కలిసి పార్కింగ్, ట్రాఫిక్ ఏర్పాట్లు, రూట్‌మ్యాప్‌ను పర్యవేక్షిస్తారు. ఐజీ చంద్రశేఖరరెడ్డి అన్ని విభాగాలకు ఇన్‌చార్జిగా ఉండగా, ఆయనకు ఖమ్మం సీపీ విష్ణు ఎస్.వారియర్, డీఐజీ రమేష్‌నాయుడు సహకరిస్తారు. ఇక బీఆర్‌ఎస్ బహిరంగ సభ, కొత్త కలెక్టరేట్ ప్రారంభం తదితర అంశాలను వరంగల్ కమిషనర్ ఏ.వీ.రంగనాథ్ పర్యవేక్షిస్తారని డైరెక్టర్ జనరల్ సంజయ్‌కుమార్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి తోడు డీజీపీ అంజనీకుమార్ యాదవ్ ఖమ్మం రానున్నారు. కాగా, జిల్లా సోమవారం చేరుకున్న పోలీసు అధికారులు బందోబస్తుపై ఉద్యోగులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

కలెక్టరేట్‌లో అడుగడుగునా నిఘా..

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్ – ఐడీఓసీ) సుమారు 39 శాఖలు కొలువుదీరనున్నాయి. ఆయా శాఖల ఉద్యోగులే కాకుండా ప్రజల రాకపోకలు పెరగనుండడంతో భద్రతపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆవరణతో పాటు కారిడార్లలో అరవై సీసీ కెమెరాలు బిగించారు. ఇవన్నీ కూడా నాణ్యమైనవని, దూరంగా నుంచి దృశ్యాలను రికార్డ్ చేయగలుగుతాయని అధికార యంత్రాంగం వెల్లడించింది.

ఆవరణలో 60సీసీ కెమెరాలు ఏర్పాటు



ఐడీఓసీలో బిగిస్తున్న సీసీ కెమెరాలు



మూడు భాషల్లో ఉన్న కలెక్టర్ బోర్డు

అందరికీ అర్థమయ్యేలా బోర్డులు

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ)కి వచ్చే వారు ఎక్కడ ఏ శాఖ ఉందో సులువుగా గుర్తించేలా బోర్డులు ఏర్పాటుచేశారు. కలెక్టర్, అదనపు కలెక్టర్లు, పలువురు ఉన్నతాధికారులకు సంబంధించిన పేర్లు, వివరాల బోర్డులను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఏర్పాటు చేయగా మిగతావి తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఉన్నాయి. కార్యాలయాన్ని జీ ప్లస్ 2 విధానంలో నిర్మించగా గ్రౌండ్ ఫ్లోర్ దాదాపుగా రెవెన్యూకు సంబంధిత శాఖలకే కేటాయించారు. ఇక మొదటి, రెండో అంతస్తులను మిగతా శాఖలకు ఇచ్చారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో కలెక్టర్ చాంబర్, కలెక్టర్ పేషీ, అదనపు కలెక్టర్ల చాంబర్‌లు, పేషీలు, డీఆర్వో, ఏఓ, ఖజానా శాఖ, స్ట్రాంగ్ రూమ్, సమావేశ మందిరం తదితరాలు ఉన్నాయి. అలాగే, ఆయా అధికారులను కలిసేందుకు వచ్చిన వారు వేచి ఉండేందుకు గదులు కేటాయించగా, ప్రతీ శాఖ గది ఎదుట పేరు, గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఫస్ట్, సెకండ్ ఫోర్లకు వెళ్లేందుకు సూచిక బోర్డులు ఏర్పాటుచేశారు.

వాస్తు బాగుండాలే..



స్టేట్ చాంబర్‌లో సూచనలు చేస్తున్న సిద్ధాంతి తేజ

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రారంభానికి సీఎం కేసీఆర్ సహాసితర ముఖ్యనేతలు హాజరుకానున్న నేపథ్యాన... కేసీఆర్ మెచ్చిన వాస్తుసిద్ధాంతి సుద్దాల సుధాకర్‌తేజ సోమవారం పరిశీలించారు. ఐడీఓసీని సందర్శించిన ఆయన అధికారులకు సూచనలు చేశారు. స్టేట్ చాంబర్‌లో సీఎంలు, ముఖ్యులకు భోజనం ఏర్పాటు చేయనున్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ముగ్గురు చొప్పున కూర్చునే సోఫాలు కాకుండా 'ఎల్' ఆకారంలో ఒక్కొక్కరే కూర్చునేలా ఏడు సోఫాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే, స్టేట్ చాంబర్‌కు ఉన్న రెండు డోర్లలో ఒకవైపు మూసి ఉంచాలని, సీఎంకు వీల్స్ లేని కుర్చీ ఏర్పాటుచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్, స్టేట్ చాంబర్ ఏర్పాటు నిర్వహణ బాధ్యులు పుల్లయ్య, కె.శ్రీరామ్, ఆర్ అండ్ బీ ఈఈ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

వెలవెల... ముస్తాబు



సామాగ్రి తరలించడంతో పాత కలెక్టరేట్ చాంబర్‌లో మిగిలిన సోఫా

ఐడీఓసీ ఈనెల 18వ తేదీన ప్రారంభం కానుండగా, ప్రస్తుత కలెక్టరేట్‌లోని సామాగ్రిని దాదాపు తరలించారు. దీంతో ప్రస్తుత కలెక్టర్ చాంబర్ వెలవెలబోతుండగా.. కొత్త కలెక్టరేట్‌లో చాంబర్ కొత్త హంగులు అద్దుకుంటోంది.



ఐడీఓసీలో ముస్తాబవుతున్న కలెక్టర్ చాంబర్

ఒక పక్క తరలింపు.. మరో పక్క పనులు



ఓ పక్క సర్దుతూనే పనిచేస్తున్న పౌరసరఫరాల సంస్థ ఉద్యోగులు

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ)కు ఇప్పటికే వివిధ శాఖల సామగ్రిని తరలిస్తున్నారు. అయితే, కొన్ని శాఖల్లో మాత్రం ముఖ్యమైన పనులను ప్రస్తుత కార్యాలయాల నుంచే చక్కబెడుతున్నారు. పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో ఒక పక్క సామాగ్రిని సిద్ధం చేయగా మరోపక్క ఉద్యోగులు పనులు చేస్తుండడం కనిపించింది.

ఉద్యాన శాఖ సామగ్రి సిద్ధం



ఉద్యాన శాఖ నుంచి తరలిస్తున్న సామగ్రి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం కృషి భవన్‌లో కొనసాగుతున్న జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖను నూతన కలెక్టరేట్ సముదాయంలోకి తరలిస్తున్నారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాధికారి జి. అనసూయ పర్యవేక్షణలో సోమవారం దస్త్రాలను మూట కట్టి కొత్త కలెక్టరేట్‌కు తరలించారు. కలెక్టరేట్ ప్రారంభం రోజు నుంచే అక్కడ విధులునిర్వర్తించనున్నారు.

సీఎం సభకు రోడ్డు



సీఎం సభకు వచ్చేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన రహదారి



డివైడర్‌ను తొలగించిన దృశ్యం

ఈనెల 18న కలెక్టరేట్‌ను ప్రారంభించడంతో సమీపానే ఏర్పాటుచేసే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ సహా మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ముఖ్యనేతలు పాల్గొననున్నారు. దీంతో కలెక్టరేట్ నుంచి సభాప్రాంగణంలోకి వెళ్లేందుకు నూతనంగా రహదారి నిర్మించారు. అలాగే, రోడ్డుకు ఆవల వాహనాలు దిగే వారు సులువుగా వచ్చేలా ఇటీవల నిర్మించిన డివైడర్లను అక్కడక్కడ తొలగించారు.



సీఎం గారు మా గోడు వినండి

కొణిజర్ల: ముఖ్యమంత్రి కేసీఆర్ తమ గోడు ఆలకించి సాగు చేసుకుంటున్న పోడు భూముల సర్వే చేయించి పట్టాలు ఇవ్వాలని మండలంలోని యల్లన్ననగర్ వాసులు కోరారు. ఈమేరకు గ్రామానికి సమీపాన నాగార్జున సాగర్ ప్రధాన కాల్వలో జలదీక్ష చేపట్టగా, ప్రజాపంథా నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గోగినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోడు భూముల సర్వే చేసినా, యల్లన్ననగర్‌లో మాత్రం నిలిపేశారన్నారు. జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం ఈ విషయంలో స్పందించి సాగుదారులకు న్యాయం చేయాలన్నారు. నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, కంకణాల అర్జునరావు, పాశం అప్పారావు, గోగుల సోములు, రాపోలు శ్రీను, లక్ష్మణ్, బాలు తదితరులు పాల్గొన్నారు.



జలదీక్షలో గ్రామస్తులు, నాయకులు

కందాళ ఫ్లెక్సీ చించివేత

నేలకొండపల్లి: మండల కేంద్రంలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఫొటోతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని ఓ వ్యక్తి చించేశాడు. ప్రధాన కూడలి వద్ద ఫ్లెక్సీని నేలకొండపల్లికే చెందిన వంశీ చించేసి వీరంగం సృష్టించగా, బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. పోలీసులు చేరుకుని ఇరువర్గాలను చెదరగొటారు. ఘటనపై బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

యువకుడిపై పోక్సో కేసు

ఖమ్మంఅర్బన్: నగరంలోని దానవాయిగూడెంకు చెందిన యువకుడు కార్తీక్‌పై పోక్సో కేసు నమోదైంది. గ్రామానికే చెందిన బాలికను ఆయన ప్రేమ పేరుతో కొంతకాలంగా వేధిస్తున్నాడు. బాలిక తండ్రి ఫిర్యాదుతో అర్బన్ పోలీసులు కేసునమోదు చేశారు.

డయాలసిస్ పేషంట్ మృతి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు(51) కొన్ని నెలలుగా జిల్లా ఆస్పత్రిలోని డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈక్రమంలో ఆరోగ్య క్షీణించి సోమవారం ఆయన మృతి చెందాడు. అయితే, సిబ్బంది పట్టించుకోకపోవడంతోనే వెంకటేశ్వర్లు మృతి చెందాడని కుటుంబ సభ్యులు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఖమ్మంఅర్బన్: నగరంలోని కొత్తగూడెంలో గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు... మహబూబాద్ జిల్లా డోర్నకల్ సమీపంలోని లచ్చితండాకు చెందిన సోమ్లా కొంతకాలంగా కొత్తగూడెంలో రైతు ఉపేందర్‌రావు పనిచేస్తున్నాడు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనగా, ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగానే సోమ్లా మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నూతనకల్‌లో యువకుడు...

తల్లాడ: మండలంలోని నూతనకల్ వద్ద రాష్ట్రీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. నూతనకల్‌కు చెందిన పమ్మి మురళి(29) మోటార్ సైకిల్‌పై వచ్చి కూరగాయలు తీసుకుని వెళ్తుండగా, కల్లూరు వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న కారు ఎదురుగా అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మురళిని ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడని ఎస్సై సురేష్ తెలిపారు.

అత్తగారింటికి వెళ్తుండగా..

చింతకాని: మండలంలోని కొదుమూరు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం గోపాలపురానికి చెందిన మద్దిన్ని సాయితేజ(27) మృతి చెందాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా సాయితేజ తన ద్విచక్ర వాహనంపై అత్తగారి గ్రామమైన వైరా మండలం రెబ్బవరం బయలుదేరాడు. మార్గమధ్యలో కొదుమూరులోని బంధువుల ఇంట్లో కాసేపు ఉండి రెబ్బవరం వెళ్లే క్రమంలో గంగమ్మ ఆలయం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి గొయ్యిలో పడింది. ఈ ఘటనలో ఆయనపై వాహనం పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాయితేజకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు...

ముదిగొండ: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కట్టకూరుకు చెందిన జిల్లా విష్ణువర్ధన్(18) చదువు ఆపేయగా మద్యానికి బానిసై మతి స్థిమితం లేని తల్లి కనకదుర్గతో చరచూ గొడవ పడేవాడు. మిగతా వారు వారించడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన గ్రామ సమీపంలోని చింతచెట్టుకు ఆదివారం ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని సోమవారం గుర్తించిన గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో తండ్రి లచ్చయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలు..

కల్లూరు: ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకోవడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. మండలంలోని చిన్నకోరుకొండికి చెందిన అరెగెల వెంకటమ్మ (75) ఆదివారం ఉదయం చెత్తను పోగు చేసి నిప్పంటించగా, మంటలు ఆమెకు చీరకు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెకు కల్లూరులో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందిందని ఎస్సై బి.కొండలరావు తెలిపారు.